www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 08 | జనవరి | 2026
పేజీలు : 8

## ప్రజా ఉద్యమాలే సిపిఐకి బలం



- మరో వందేళ్లయినా ఇదే స్ఫూర్తితో ముందడుగు
- ఖమ్మంలో జరిగే శత వసంత ముగింపు సభకు భారీగా తరలాలి : కూనంనేని
- ముగిసిన ప్రచార జాతా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/సుజాతనగర్ :** ఇప్పటికీ ఎప్పటికీ సిపిఐకి ప్రజా ఉద్యమాలే బలమని, ఈ శత వసంతం అనేక ఉద్యమాలు, త్యాగాలతో సాగిందని, రాబోయే వందేళ్లు కూడా ఇదే స్ఫూర్తితో ముందడుగు వేస్తామని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ శత వసంత ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఈనెల 3న చర్ల మండల కేంద్రంలో సిపిఐ సీనియర్ నాయకులు, జాతీయ కంట్రోల్ కమీషన్ చైర్మన్ డా.నారాయణ ప్రచార జాతాను ప్రారంభించారు.

మిగతా 2లో..

# ఎన్నికలంటే నేతల వెన్నులో వణుకు..!




### -లక్షల్లో ఖర్చు.. మున్సిపల్ ఎన్నికల ముంగిట ఆందోళన
### -పెరిగిన ఓటు ధర

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎన్నికలంటే ఇప్పుడు నేతల వెన్నులో వణుకు వస్తుంది. ఇటీవల పంచాయతీ ఎన్నికల పోకడ చూసిన తర్వాత భయం మరింత ఎక్కువైంది. గతంలో ఎన్నికలంటే అభ్యర్థుల గుణ గణాలు, పార్టీల సిద్ధాంతాలు, ఆచరణ, ప్రజా ఉపయోగ పథకాలు, ఇతరత్రా వాటిని చూసి ఓట్లు వేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు ఎన్నికలంటే కొనుగోళ్లు. నేతలకు అధికారం ముఖ్యమైంది. విలువలు లేని రాజకీయాల నడుమ నాయకులను నమ్మి ఓట్లు వేసే పరిస్థితి లేని రోజుల్లో సగానికి పైగా ఓటర్లు తమను తృప్తి పరిచిన వారికి ఓట్లు వేస్తున్నారు. పార్టీల పక్షాన  ఆలోచించి అభ్యర్థులను గెలిపించిన వారు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియకపోవడం జంప్ జిలానీలుగా మారిన నేపథ్యంలో ఓటర్ల ఆలోచనల్లో కూడా మార్పులు వచ్చాయి. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థుల ఖర్చు చూస్తే ఎన్నికలంటే ఒక జూదంగా మారిపోయాయన్న భావన కలుగుతుంది. కొన్ని గ్రామాల్లో లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ఓటమి చెందిన వారు ఉండగా అదే డబ్బుతో ప్రజలతో కనీస సంబంధాలు లేకుండా ఘన విజయాలు సాధించిన వారు ఉన్నారు. వార్డు సభ్యులకు పోటీ చేసిన వ్యక్తులే లక్షలు ఖర్చు చేసిన గ్రామ పంచాయతీలు ఖమ్మం జిల్లాలో అనేకం ఉన్నాయి. పాలేరు నియోజక వర్గంలో ఒక పంచాయతీలో వార్డుకు పోటీ చేసిన అభ్యర్థి పెట్టిన ఖర్చు అక్షరాల రూ. 10 లక్షలు, ఆ వార్డులో ఉన్న ఓట్లు 190 అయినా ఓటమి చెందాడు. ఇటువంటి ఘటనలు అనేకం జరిగాయి. 600 ఓట్లు ఉన్న ఓ గ్రామ పంచాయతీలో ఇరు వర్గాలు పెట్టిన ఖర్చు రూ. 40 లక్షల పైమాటే. ఖమ్మం నగరానికి సమీపంలో ఉన్న ఒక మేజర్ ఓ గ్రామ పంచాయతీలో ముగ్గురు అభ్యర్థులు పెట్టిన ఖర్చు రూ.2.30 కోట్లు దాటిందంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అవగతమవుతుంది. ఆయా గ్రామ పంచాయతీల్లో పార్టీలకు నేతృత్వం వహించిన వారు  ఖర్చు చూసి బెంబేలెత్తారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇప్పుడు మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికలు వస్తున్నాయంటే నేతల గుండెల్లో దడ మొదలైంది. గ్రామ పంచాయతీల్లోనే ఓటును రెండు వేల నుంచి పది వేల వరకు కొనుగోలు చేశారంటే ఇప్పుడు మున్సిపాలిటీలలో, కార్పోరేషన్లలో ఓట్ల సంగతేమిటని ఆత్మ పరిశీలనలో పడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లోనే రోజు వారి కూలీ చెల్లిస్తే తప్ప ప్రచారానికి

మిగతా 2లో..

## కదం తొక్కుతూ కదలి రండి



-ప్రజా సమస్యల పరిష్కారమే సిపిఐ లక్ష్యం
-ఖమ్మం నగరంలో జీపుజాతా

2లో..

## కబడ్డీ కూతకు వేళాయే..



-క్రీడాకారులకు ఘనస్వాగతం పలికిన విద్యార్థులు
-జాతీయ కబడ్డీ క్రీడలను ప్రారంభించిన మంత్రుల, ఎంఎల్ఏలు
-ఏజెన్సీ ప్రాంతంలో నిర్వహించడం ఎంతో ఆనందాయకం

సెంటర్‌స్ప్రెడ్

## ఖమ్మం అభివృద్ధిలో భాగస్వాములు కండి

-ముఖ్యమంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు





**ప్రజాపక్షం ఖమ్మం అర్బన్ :** ఖమ్మం అభివృద్ధిలో కార్పొరేటర్లు భాగస్వామ్యం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సారథ్యంలో బుధవారం ఖమ్మం కార్పోరేషన్ బిఆర్ఎస్ పార్టీకి చెందిన 33వ డివిజన్ కార్పొరేటర్ తోట ఉమారాణి వీరభద్రం, 34వ డివిజన్ కార్పొరేటర్ రుద్రగాని శ్రీదేవి ఉపేందర్, 17వ డివిజన్ కార్పొరేటర్ ధనాల రాధ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి

మిగతా 2లో..

## మృత్యువులోనూ వీడని మూడుముళ్ల బంధం



### ఉద్యోగ ఆనందం తీరకముందే అనంతలోకానికి..



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న వద్దడి వెంకటరత్నం, రాము దంపతులు సోమవారం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే టీచర్స్ కాలనీకి చెందిన రాము భార్య వద్దడి వెంకటరత్నం మూడు నెలల క్రితం ప్రభుత్వ ఉద్యోగంలో చేరింది. ప్రతిరోజు ఉద్యోగం విధులు నిర్వహించి ఇంటికి వచ్చే భార్యను, భర్త రాము తీసుకొని వచ్చేవాడు. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి భార్యను తీసుకొని వైరాకు వస్తున్న రాము ఆటోను సోమవారం

మిగతా 2లో..

# ఎన్నికలంటే నేతల వెన్నులో వణుకు..!

(మొదటిపేజీ తరువాయి)

కదల లేదు. ఇప్పుడు ఓటర్లలో మరో ప్రత్యేక పరిస్థితి ఏర్పడింది. రాజకీయ పార్టీలకు అభిమానులుగా ఉన్నప్పటికీ గతంలో మాదిరి జెండాలు పట్టుకుని తిరిగే పరిస్థితి లేదు. ఒక పార్టీ పక్షాన తిరిగితే మరోక అభ్యర్థికి చెందిన వారు ఓట్లు వేయరనే ఆలోచనతో ప్రజలు బయటకు రావడం లేదు. ఎవరు డబ్బులిస్తే వారి ప్రచారానికి వెళ్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలను ఫిబ్రవరి మాసంలో నిర్వహించేందుకు సిద్ధమవుతుండగా ఎన్నికల బరిలో నిలవాలనుకున్న వారు సమాయత్తం అవుతున్నారు. కానీ ఎన్నికలు నడిపే విషయంలో నేతల్లో తర్జన భర్జన మొదలైంది. ప్రజాభిమానం పక్కన పెట్టి ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఖర్చు చేయగలిగిన వారినే పార్టీలు రంగంలోకి దింపే ఆలోచనలో ఉన్నాయి. అడిగిన దానికి కాదనకుండా నగదు పంచగలిగిన వారే అభ్యర్థులుగా నిలిపే అవకాశం ఉంది. మొత్తంగా మారుతున్న పరిస్థితుల్లో ఎన్నికలంటే రాజకీయ పార్టీల నేతల్లో ఖర్చును చూసి భయం మొదలైంది. పంచాయతీలే అనుకుంటే ఇక మున్సిపాలిటీలలో పరిస్థితి ఏవిధంగా ఉంటుందో ఆలోచించుకోవచ్చు. ఇదిలా ఉండగా ఖమ్మం కార్పొరేషన్‌కు సైతం జిల్లాలోని మున్సిపాలిటీలతో పాటే ఎన్నికలు జరుగుతాయని భావిస్తున్న నేపథ్యంలో కార్పొరేటర్లు అధికార పార్టీలోకి వలస ప్రారంభమైంది. మూడు రోజుల క్రితం ఐదుగురు మహిళా కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి చేరగా బుధవారం మరో ముగ్గురు మహిళా కార్పొరేటర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఖమ్మం కార్పోరేషన్ పాలక వర్గానికి మే ఏడు వరకు గడువు ఉన్నప్పటికీ దానిని రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు వెళ్లేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# ప్రజా ఉద్యమాలే సిపిఐకి బలం





(మొదటిపేజీ తరువాయి)

ఐదు రోజులపాటు ఐదు నియోజకవర్గాల వ్యాప్తంగా సాగి,బుధవారం సుజాతనగర్ మండలంలో ముగిసింది. ఈ ప్రచార జాతకు సబ్బండ వర్గాల ప్రజలు,పార్టీ శ్రేణులు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు.ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో విప్లగీతాలాపనలతో పాటు నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ జాత సందర్భంగా సిపిఐ వందేళ్ల చరిత్రను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. జాతా ముగింపు లో భాగంగా సుజాతనగర్‌లో ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ భారత స్వతంత్రాని కంటే ముందే ఆవిర్భవించిన సిపిఐ స్వాతంత్ర సంగ్రామంలో సంపూర్ణ స్వరాజ్యం కావాలని పోరాటం చేసిందని, ఈ పోరాటంలో ఎందరో యువ కిషోరాలు ప్రాణతర్పణం చేశారని కూనంనేని చెప్పారు. ఆ నాటి నుండి నేటి వరకు ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉధ్యమాలు నిర్వహిస్తూ ప్రజా క్షేత్రంలో ముందుకు వెళుతోందని చెప్పారు. రానున్న నూతన వసంతం కూడా ప్రజా ఉద్యమాలను పెనవేసుకుంటుందని, ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి పాటుపడుతుందన్నారు. పదవులున్నా లేకున్నా ప్రజాక్షేత్రంలో వందేళ్ల పాటు మనగలిగిన పార్టీ సిపిఐ ఒక్కటే అని, స్వతంత్ర భారతంలో ఎన్నో పార్టీలు పుట్టుకొచ్చినప్పటికీ చాలా పార్టీలు కాలగర్భంలో కలిసిపోయాయన్నారు. గిరిజనులు, రైతులు, కార్మికులు, కర్షకులు, బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి హక్కులు సాధనతో పాటు కూడు,గుడ్డ కల్పించేందుకు పాటు పడిందన్నారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వంతో మాట్లాడి అత్యధిక నిధులు తెప్పించి రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చి దిద్దేందుకు వెనుకాడేది లేదన్నారు. త్వరలో జరగనున్న కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించుకుని కార్పోరేషన్ కైవసం చేసుకుని ఎర్రజెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. సిపిఐ శత వసంత ఉత్సవాలను పురస్కరించుకుని భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం కేంద్రంగా ఐదు లక్షల మందితో ముగింపు సభ నిర్వహిస్తోందని, ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు, సిపిఐ జాతీయ కార్యదర్శి డి రాజా,40 దేశాల నుండి కమ్యూనిస్టు నాయకులతో పాటు మేధావులు, కమ్యూనిస్టు సానుభూతి పరులు, కవులు, కళాకారులు తరలివస్తున్నారని కూనంనేని చెప్పారు. సభ విజయవంతానికి జిల్లా వ్యాప్తంగా తరలి రావాలని కోరా రు. సుజాతనగర్ మండల కార్యదర్శి కొమారి హన్మంతరావు అధ్యక్షతన జరిగిన ఈ ప్రచార జాత ముగింపులో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర రావు, నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, సలగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, భూక్య ధస్రు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, గనిగల వీరస్వామి, ఉప్పుశెట్టి రాహుల్, వీశంశెట్టి పూర్ణచంద్ర రావు, ఫహీం, రత్నకుమారి, నిమ్మల రాంబాబు, జక్కుల రా ములు, తాళ్ల వెంకటేశ్వర్లు, భాగం శేషభూషణం, తాళ్లూరి పాపారావు, తాళ్లూరి ధర్మారావు, లావుడ్య గోపి, వీర్ల మల్లేష్, బొడ్డు కేశవరావు, వీర్ల దుర్గాప్రసాద్,మూడ్ గణేష్, భూక్య శ్రీను, సర్పంచ్ రామనాథం పాల్గొన్నారు.

# కదం తొక్కుతూ కదలి రండి

ప్రజాపక్షం/ ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జనవరి 18న జరిగే బహిరంగ సభకు వేలాది మంది కదం తొక్కుతూ కదిలి రావాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వందేళ్లుగా సిపిఐ పని చేస్తుందని అధికార యావ లేకుండా ప్రజల పక్షాన నిలిచిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనని ఆయన తెలిపారు. బుధవారం శతాబ్ది ఉత్సవ ముగింపు సభ ప్రచారంలో భాగంగా ఎన్‌టిఆర్ సర్కిల్, గ్రేయిన్ మార్కెట్, పాత బస్టాండ్ సెంటర్, ముస్తఫానగర్, రోటరీ నగర్, రామన్నపేట, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన సభల్లో జితేందర్ రెడ్డి మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఆవిర్భావించిన కమ్యూనిస్టు పార్టీ నాటి స్వాతంత్ర్య పోరాటంలోనూ ఆ తర్వాత నిజాం వ్యతిరేక పోరాటంలోనూ కమ్యూనిస్టు పార్టీ వీరోచిత పాత్ర నిర్వహించిందన్నారు. 1925లో ఈ దేశ సంపూర్ణ స్వాతంత్ర్యానికి తీర్మానం చేసింది తొలుత కమ్యూనిస్టు పార్టీయేనని కాంగ్రెస్ పార్టీ 1927లో సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చిందని జితేందర్ రెడ్డి తెలిపారు. పేషావర్ మీరట్ సహా పలు కుట్ర కేసులను బ్రిటిష్ ప్రభుత్వం కమ్యూనిస్టులపై పెట్టి తీవ్ర నిర్బంధాలకు గురి చేసిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు భారతదేశపు నడిబొడ్డున నిజాం స్వతంత్ర రాజ్యాంగా ప్రకటించుకున్నప్పుడు భారతదేశంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. నాలుగున్నర వేల మంది అమరులయ్యారని తద్వారా నిజాం రాజ్యం భారతదేశంలో విలీనమైందన్నారు. భూమి కోసం భుక్తి కోసం జరిగిన ఆ మహోద్యమం తెలంగాణ ప్రజల్లో చైతన్యానికి కారణమైందని జన జీవితంలో మార్పు తెచ్చిందన్నారు. భూ సంస్కరణల చట్టం, దున్నేవాడికే భూమి దక్కాలని, బ్యాంకుల జాతీయకరణ, ఇటీవల జాతీయ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం సహా




అనేక పోరాట విజయాలను కమ్యూనిస్టు పార్టీ సాధించిందన్నారు. 2024 డిసెంబర్ 26 నుంచి దేశ వ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయని ముగింపు ఉత్సవం జనవరి 18న ఖమ్మంలో జరుగుతుందని ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభకు వేలాదిగా తరలి రావాలని జితేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఖమ్మం నగరం ఉద్యమాల గుమ్మంగా నిలిచిందని ఖమ్మం నగర ప్రజలు అనేక దశాబ్దాలుగా వామపక్ష పార్టీలను ఆదరిస్తున్నారని ఆ క్రమంలోనే జనవరి 18 సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, మహ్మద్ సలాం, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, సిహెచ్ సీతామహలక్ష్మి, పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు గాదె లక్ష్మి నారాయణ, తాటి నిర్మల, నూనె శశిధర్, వరదా నర్సింహారావు, బోడా వీరన్న, మందా వెంకటేశ్వర్లు, సిద్ధి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న కళారూపాలు...**

ప్రచార జాతాల సందర్భంగా ప్రజా నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేకించి సమకాలిన పరిస్థితులను వివరిస్తూ పాడిన పాటలు పలువురిని ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో ఆరెంపుల సతీష్, పల్లెసుద్దుల శ్రీను, మనోజ్, చందర్ రావు, శ్రీకాంత్, శాంతి, మృతేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం అభివృద్ధిలో భాగస్వాములు కండి



(మొదటిపేజీ తరువాయి)

ఆహ్వానించారు. మూడు రోజుల క్రితం ఐదుగురు కార్పొరేటర్లు బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ సారధ్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఖమ్మం అభివృద్ధిలో కార్పొరేటర్లు భాగస్వామ్యం కావాలన్నారు. కొత్తగా చేరిన కార్పొరేటర్లతో పాటు కాంగ్రెస్ కార్పొరేటర్లంతా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఖమ్మం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మృత్యువులోనూ వీడని మూడుముళ్ల బంధం

(మొదటిపేజీ తరువాయి)

సమీపంలో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వద్దడి వెంకటరత్నం అక్కడికక్కడే మరణించగా, భర్త రాము తీవ్ర గాయాలు పడి ఉండడంతో హాస్పిటల్‌లోకి తరలించారు. హాస్పిటల్‌లో రాము బుదవారం ఉదయం 7గంటలకు మృతి చెందాడు. మృతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మూడు నెల లక్రితం ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని, ఆనందంలో ఉన్న ఆ దంపతులకు ఆనందం కూడా దక్కలేదు. ఉద్యోగం వచ్చిన ఆనందం సంతోషం తీరక ముందే అనంతలోకానికి వెళ్లిపోయారు. మృత్యువులో కూడా ఆ దంపతులు విడిపోలేదు. కష్టాలు పడ్డారు ఎన్నో వ్యాపారాల్లు చేశారు. బ్రతుకుతెరువుకు పిల్లల భవిష్యత్తుకు పునాది చేద్దామనుకున్నారు. భగవంతుడు వారిని అనంతలోకానికి తీసుకెళ్లారు. ఉద్యోగం వచ్చింది. పిల్లలకు మంచి భవిష్యత్తు వస్తుంది అనుకున్న సమయంలోనే ఇలాంటి రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు అనంతోకానికి వెళ్లారు. తల్లిదండ్రులు మరణవార్తతో చిన్న పిల్లలు రోదన ప్రతిఒక్కరిని కంటి కన్నీరు పెట్టించింది. టీచర్స్ కాలనీ ప్రాంతం మొత్తం మూగబోయింది. అయో పాపం ప్రతిరోజు పనిచేసుకొని సాయంత్రం ఇంటికి వచ్చే తల్లిదండ్రుల కోసం ఎదురుచూసే ఆ పిల్లలు ఎదురుచూపు మా అమ్మానాన్న ఇంకెప్పుడు వస్తారు అనే విధంగా చూస్తూ ఏడుస్తున్న తీరు ప్రతిఒక్కరి కంట కన్నీరు పెట్టించింది.

**మూడు నెలల క్రితం టీచర్ ఉద్యోగం పొందిన వెంకటరత్నం**

వద్దడి వెంకటరత్నం ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో ప్రకటించిన డీఎస్సీ ఉద్యోగాల్లో హింది పండిట్ ఉద్యోగం సంపాదించింది. ఈ క్రమంలోని జగ్గయ్యపేటలో హిందీ పండితుల ఉపాధ్యాయురాలుగా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. గత 20 సంవత్సరా క్రితం వద్దడి వెంకటరత్నం, రాము దంపతులు వైరా వచ్చి పలురకాల వ్యాపారాలు నిర్వహించి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. వీరి స్వగ్రామం విజయనగరం జిల్లా రాజం గ్రాం. మూడు నెలల క్రితం భార్య వెంకటరత్నంకు ఉద్యోగం వచ్చింది. దీంతో ఎంతో సంతోషపడ్డ భర్త ప్రతిరోజు భార్యను విదులు నిర్వహించుకున్న తర్వాత తీసుకొని వచ్చేవాడు. ఈ క్రమంలోనే తీసుకొని వస్తుండగా మృత్యు వెంటాడింది.

# టాస్క్‌ఫోర్స్ అదుపులో అక్రమ ఫైనాన్సర్లు

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : అధిక వడ్డీలకు అక్రమ ఫైనాన్స్ చేస్తున్న వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఖానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసిపి సత్యనారాయణ తెలిపారు. చట్టవిరుద్ధంగా అధిక వడ్డీలకు నగదు ఇచ్చి రోజువారి వసూళ్లకు పాల్పడుతున్న సారధినగర్‌కు చెందిన ఫైనాన్సర్లు శివకుమార్, బానోత్ దీపాకుమారిలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. రూరల్ మండలం దానవాయిగూడెం ప్రాంతానికి చెందిన బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు గిరిగిరి నడుపుతున్న సదరు సారధినగరుకు చెందిన ఫైనాన్సర్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి ప్రంసరీనోట్లు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకుని ఖానాపురం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు పేర్కొన్నారు. ఒకరు పరారీలో ఉన్నారని వారిని పట్టుకునేందుకు చర్యల కోసం ఖానాపురం పోలీసులకు అప్పగించినట్లు ఏసిపి తెలిపారు.

# స్మశానవాటికకు దారి ఏర్పాటు చేయండి



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం గ్రామ పంచాయితీలో గల చింతలచెరువుకు దగ్గరలోని స్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయాలని దీనిపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని తహసీల్ధార్ మణిధర్‌కు వినతి పత్రం గ్రామ పంచాయితీ సర్పంచ్ బానోత్ సదర్ లాల్, ఉప సర్పంచ్ తుళ్లూరి ప్రకాష్‌లు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అశ్వాపురం ఎస్సీ కాలనీలో ఎవరైనా చనిపోతే ఇండ్ల మధ్యలో నుండి పెళ్లిళ్లు, ఫంక్షన్లు పండగల సమయంలో కూడా ఇండ్ల మధ్య నుండి మృతదేహాలను తీసుకుని వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని, కావున ఊరి బయటి నుండి స్మశాన వాటికకు మృతదేహాలను తీసుకుని వెళ్ళుటకు గతంలో ఉన్న కాలిబాట సుమారు 120 మీటర్లను గ్రామ పంచాయితీ వారికి కేటాయించాలని కోరారు. పంచాయితీకి కేటాయిస్తూ అట్టి రోడ్డును అభివృద్ధి చేస్తామని అన్నారు.

# బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలి



ప్రజాపక్షం/అశ్వాపురం: ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలోనే వెనుకబడిన తరగతుల బీసీ సమగ్ర అభివృద్ధి కోసం చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షులు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ వద్ద నుండి ఇప్పటి వరకు సబ్ ప్లాన్‌లకు బడ్జెట్ కేటాయించి ఖర్చు చేయలేదని ఆ మిగిల్చుకున్న బడ్జెట్ బీసీ విద్యార్థుల కోసం అన్ని మండలాలలో బహుజన గురుకులాలు, పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో హుస్సేన్, అద్దంకి భూషయ్య, కల్లూరి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని మరిచిన మంత్రులు





**-రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమే**
**-బిఆర్ఎస్ నేత కేటిఆర్**
**-సరిహద్దుల వద్ద ఘన స్వాగతం**
**-బిఆర్ఎస్ సర్పంచులకు సన్మానం**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంజిల్లాలో ముగ్గురు మంత్రులున్నా జిల్లాకు ఎటువంటి ఉపయోగం లేదని కేసిఆర్ చేసిన అభివృద్ధి తప్ప మరొకటి లేదని బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటి రామారావు తెలిపారు. ముగ్గురు మంత్రులు కమిషన్ దందాలో మునిగితేలుతున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం కేటిఆర్ ఖమ్మం జిల్లాలో పర్యటించారు. జిల్లా సరిహద్దుల వద్ద కేటిఆర్‌కు ఘన స్వాగతం పలికారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలతో బిఆర్ఎస్‌లో తిరిగి కదలిక మొదలైంది. బిఆర్ఎస్ నేతలు ఊహించిన దాని కంటే పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. స్థానిక బిఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సభలో కేటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తప్పిదాలను ఒప్పుకుంటుందని ప్రభుత్వ పాలన వైఫల్యం బయట పడిందన్నారు. షాపుల్లో లేని యూరియా యాప్‌లలో వస్తుందా అని ఆయన ప్రశ్నించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో యూరియా కొరత లేదని కానీ ఇప్పుడు యూరియా కోసం రైతులు రోడ్లెక్కారని కేటిఆర్ తెలిపారు. ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కేసిఆర్ శ్రమించారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఖమ్మం జిల్లా గురించి పట్టించుకునే స్థితిలో లేదన్నారు. కాంగ్రెస్ పాలన అంటే ఏగవేతలు, కూల్చివేతలు మాత్రమేనని ఆయన ఎద్దేవా చేశారు. కౌలు రైతులకు ఇస్తామన్న డబ్బులు కానీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కానీ రైతులకు అందిందా అని ఆయన ప్రశ్నించారు. 30 శాతం మంత్రులు పన్ను వసూలు చేస్తున్నారు తప్ప పాలన గురించి, అభివృద్ధి కార్యక్రమాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. కట్టిన ఇండ్లు, పెట్టిన పొయ్యి తరహాలో ప్రభుత్వాన్ని అప్పగిస్తే ఏమి చేయలేదన్నారు. బిఆర్ఎస్ కూడా అప్పు చేసిన మాట వాస్తవమేనని కానీ ఆ డబ్బును రాష్ట్ర అభివృద్ధి కోసం వినియోగించామన్నారు. బూతు మాట్లాడటం తనకు ఇష్టముండదని కానీ రేవంత్‌రెడ్డి మాటతీరు తమలో ఆవేశాన్ని తీసుకు వస్తుందన్నారు. ఎంత మంది ఖమ్మం కార్పొరేటర్లను కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఒరిగేదీ ఏమి లేదని కేటిఆర్ తెలిపారు. రానున్న కాలంలో ఐక్యంగా పనిచేస్తే మెజార్టీ సీట్లు జిల్లాలో గెలిచే అవకాశం ఉందన్నారు.ఈసభలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, మాజీ శాసన సభ్యులు తాటి వెంకటేశ్వర్లు, సండ్ర వెంకటవీరయ్య, రేగా కాంతారావు, వనమా వెంకటేశ్వరరావు, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోత్ చంద్రావతి, హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ డిసిసిబి ఛైర్మన్ కూరాకుల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# సమృద్ధిగా యూరియా నిల్వలు

**-10.345 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ -కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలో యాసంగి సాగు అవసరాలకు సమృద్ధిగా యూరియా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు సకాలంలో యూరియాను పంపిణీ చేసేందుకు అన్ని మండలాల్లో సమగ్ర చర్యలు చేపట్టామని ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో 10.345 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందన్నారు. 83 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో 1169.10 మెట్రిక్ టన్నులు, 100 ప్రైవేట్ దుకాణాల్లో 525.70 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. ఇప్పటి వరకు రైతులకు 28.128 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు కలెక్టర్ తెలిపారు. యూరియా పంపిణీకి సంబంధించి రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఎటువంటి సమస్యలు ఉన్న వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకు రావాలని కలెక్టర్ తెలిపారు.

# నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఖమ్మం కలెక్టరేట్‌లో గురువారం వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా స్థాయి ఆటల పోటీల నందు మొదటి, రెండవ స్థానంలో నిలిచిన దివ్యాంగులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించనున్నట్లు ఆమె తెలిపారు.

# బైక్ ర్యాలీని జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** భారత కమ్యూనిస్టుపార్టీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఈనెల 18న ఖమ్మం నగరంలో జరిగే మహాప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయటకు ఈరోజు మండలంలో బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నామని ఈబైక్ ర్యాలీలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ కొణిజర్ల మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీ ఉదయం 8 గంటలకు కొణిజర్లలో ప్రారంభం అవుతుందని 8.30 కి మల్లుపల్లి, 9.00 రామనర్సయ్యనగర్, 9.15కు సీతారామ్‌నగర్, 9.30 కి తుమ్మలపల్లి, 10 గంటలకు బోడి యాతండా, 10.30కి తనికెళ్ల, 11 గంటలకు అమ్మపాలెం, 11.30కి చిన్నగోపతి, మధ్యాహ్నం 12 గంటలకు పెద్దగోపతి, 12.30కి రెడ్డిగూడెం, కొండవనమాల, 1.00 కి కొత్తకాచారం, పాతకాచారం, చిన్నమునగాల, 1.30కి పెద్దమునగాల భోజనవిరామసయం, 2.30కి గోపవరం, 3.00 లింగగూడెం, 3.30కి దుద్దెపూడి, పల్లిపాడు, సాయంత్రం 6.00 కి గుబ్బగుర్తి, అంజనాపురంతో ముగింపు ఉంటుందని ఈ బైక్‌రాలీలో అత్యధికంగా నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# భూ సేకరణ ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలి

**-భూ సేకరణపై సమీక్షించిన అదనపు కలెక్టర్**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సీతారామ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూ సేకరణ ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులకు భూ సేకరణపై కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకంకు సంబంధించి రైతులకు సాగునీటిని అందించే అవసరమైన డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. సీతారామ ప్యాకేజీ 2కు సంబంధించి 12ఎల్ ఆర్ఎం1 మైనర్ కాలువ ద్వారా కల్లూరు, పెనుబల్లి మండలాల్లో 12484 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు. దీనికి సంబంధించి అవసరమైన భూముల సేకరణ కోసం పెనుబల్లి మండలంలో ఎస్‌డిఆర్ ప్రక్రియ ఫిబ్రవరి మూడు నాటికి పూర్తి చేయాలన్నారు. కల్లూరు మండలంలో ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి పబ్లిక్ నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. నోటిఫికేషన్ అనంతరం గడువు ముగిసిన తర్వాత భూ సేకరణ ప్రక్రియలో భాగంగా గ్రామసభ నిర్వహించి చట్టం ప్రకారం అవార్డు జారీ, తదుపరి చర్యలు చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు.ఈ సమావేశంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు శ్రీనివాసులు, సర్వేయర్లు, తహసీల్దార్లు, ఇరిగేషన్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శతాబ్ది ఉత్సవ ముగింపు సభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/బోనకల్‌:** ఈ నెల 18న జరిగే శతాబ్ది ఉత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. మండలంలోని గోవిందాపురం(ఎల్)లో ఉత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని కోరుతూ సన్నాహాక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో పోరాటాలు, త్యాగాలు, విజయాలు సాధించిందని అన్నారు దున్నేవాడికే భూమి, భూమి కోసం భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం మట్టి మనుషులు నడిపిన మహత్తర పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటమన్నారు. ఈనెల 18న ఖమ్మంలో 5 లక్షల మందితో జరిగే భారీ ప్రజా ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ ముగింపు ఉత్సవాలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శి డి రాజా, ఆయా దేశాల, రాష్ట్రాల కార్యదర్శులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐకెఎస్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జక్కుల రామారావు, మండల కార్యవర్గ సభ్యులు ఆకెన పవన్, యర్రగాని వెంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ యూత్ నాయకులు జక్కుల నిఖిల్ తదితరులున్నారు.

# పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో సైబర్‌మోసాలు




**- సైబర్‌క్రైం సిఐ నరేష్**

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపారు. 'సైబర్‌జాగృక్త దివాస్'లో భాగంగా బుధవారం మాక్స్ ఇనిస్టుట్ ఆఫ్ ఫార్మసుటికల్స్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సిఐ మాట్లాడారు. డేటింగ్‌యాప్స్, సైబర్‌బుల్లింగ్, సైబర్ స్టాకింగ్, మాట్రిమోనిల్, సిఎస్ఈఏఎం తో జరుగుతున్న నేరాలపై వారికి వివరించారు. వాట్సప్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా ద్వారా అప్లికేషన్ లింక్‌లను ప్రజలకు పంపి లాభం పొందవచ్చని ప్రలోభాలకు గురిచేస్తారన్నారు. అటువంటి వాటిని ఓపెన్ చేయవద్దని ఒకసారి ఓపెన్‌చేస్తే సదరు అప్లికేషన్ ఇన్‌స్టాల్ అయి ఫోన్‌లో ఉన్న యూపిఐ యాప్‌ల లోని బ్యాంక్‌వివరాలు, ఓటిపిలు తస్కరిస్తుందన్నారు. సైబర్ కేటుగాళ్ల చేతిలోకి వివరాలు వెళ్లటంతో ఆర్థికంగా నష్టపోవలసి వస్తుందన్నారు. దీని దృష్టిలో ఉంచుకుని వాట్సప్‌లో వచ్చే అనుమానిత లింక్‌లు, అనధికారిక గ్రూప్‌లు, ఏపికే ఫైల్స్ క్లిక్ చేయవద్దని సిఐ నరేష్ విద్యార్థులకు సూచించారు. బ్యాంక్, ఓటిపి వంటి వివరాలు ఎవరు అడిగిన చెప్పవద్దని, షేర్ చేయవద్దని పేర్కొన్నారు. అంతేకాకుండా సైబర్ నేరగాళ్లు మీషో, ఫ్లిప్ కార్ట్, అమెజాన్ పేర్లతో తక్కువ సమయంలో ఎక్కువ నగదు వచ్చే పార్ట్ టైం ఉద్యోగాలు ఉన్నాయంటూ వాట్సప్, టెలిగ్రామ్‌లతో వచ్చే మెసెజ్‌లు నమ్మవద్దన్నారు. ఈ సదస్సులో సైబర్‌క్రైం ఎస్ఐ రంజిత్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ ఎం ప్రసాద్, మాక్స్ కళాశాల ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు సత్యనారాయణ, రాజీవ్‌కుమార్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కొనసాగిన కార్మికులు, ఉద్యోగుల ధర్నా




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మిత్రషోరూం ఎదుట కార్మికులు, ఉద్యోగులు నిర్వహిస్తున్న ధర్నా బుధవారం రెండవరోజుకు చేరుకుంది. సిపిఐయు ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు పెరుమాళ్లపల్లి మోహన్‌రావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కార్మికులు, ఉద్యోగులు జీతాలతో పాటు రావాల్సిన ఎలవెన్సులు ఇవ్వడంతో పాటు వారికి ఉపాధిని కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ధర్నాను ఉధృత రూపం దాలుస్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షోరూం యునిట్ సభ్యులు శ్రీనివాస్, రాందేవ్, బి. వెంకటేశ్వర్‌రావు, శుక్రుపాషా, భరద్వాజ, జాహ్నవి, క్రిష్ణ, నవీన్, రజిత, నరసింహారావు, ప్రసాద్, మీరా తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి కాల్వఒడ్డు మున్నేరు వంతెనపై కార్లు..ఆటోలకు అనుమతి



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : సంక్రాంతి పండుగ సందర్భంగా పెరుగుతున్న వాహనాల రద్దీ నేపద్యంలో ఖమ్మం పరిసర ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల జిల్లాలకు వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా నేటి నుంచి ఈనెల 20వ తేదీ వరకు కాల్వొఒడ్డు మున్నేరు పాత వంతెనపై కార్లు, ఆటోల రాకపోకలకు తాత్కలికంగా అనుమతిస్తున్నట్లు ట్రాఫిక్ సిఐ బెల్లంకొండ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపాస్ మున్నేరు బ్రిడ్జిపై వాహనాల రద్దీ పెరగటంతో సాదరణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ నెపద్యంలో కాల్వొఒడ్డు పాత వంతెనపై సాదరణ వాహనాల రాకపోకలకు అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు కొరకు ఇరువైపులా గుంతలు తవ్వి ఉన్నందున వాహనదారులు, ప్రయాణికులు వాటిని గమనించి జాగ్రత్తగా వెళ్లవలెనని ఆయన సూచించారు.

## బైక్ ర్యాలీ జయప్రదం చేయండి

ప్రజాపక్షం/చింతకాని : సిపిఐ శత వసంతాల ముగింపు సభ జయప్రదం చేయాలని కోరుతూ సిపిఐ చింతకాని మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగే బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని సిపిఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం 8.00 గంటలకు కొదుమూరులో ప్రారంభమయ్యే ర్యాలీ రాఘవాపురం, బస్వాపురం, రామకృష్ణాపురం, అనంతసాగర్, గాంధీనగర్ కాలనీ, బొప్పారం, పందిళ్ళపల్లి, జగన్నాధపురం, మత్కేపల్లి, తిరుమలాపురం, తిమ్మినేనిపాలెం, చిన్నమండవ, సీతంపేట, నాగులవంచ, రైల్వేకాలనీ, పాతర్లపాడు, ప్రొద్దుటూరు, నాగిలిగొండ, కోమట్లగూడెం, నేరడ, లచ్చగూడెం, నర్సింహాపురం, చింతకాని చేరుతుందన్నారు. కార్యకర్తలు, పార్టీ అభిమానులు సకాలంలో హాజరై ఈ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



ప్రజాపక్షం/చింతకాని : విద్యతో పాటు క్రీడల్లో రాణించి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు పేర్కొన్నారు. బుధవారం చింతకాని విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందజేశారు. పాఠశాలలో ఖాళీ సమయంలో ఎక్కువగా ఆటలపై దృష్టిపెట్టాలని పాఠశాలలో నిర్వహించే ఆటల పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిలారు సరోజిని , గ్రామస్థులు కోలా నాగేశ్వరరావు, చిన్నారులు పాల్గొన్నారు.

## మృతులకు నివాళి



ప్రజాపక్షం/వైరాః రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైరా మున్సిపాలిటీ పరిధిలోని టీచర్స్ కాలనీకి చెందిన వడ్డడి రాము, వెంకటరత్నం దంపతుల ఇద్దరి మృతదేహాలపై కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ల సంతోష్, కట్ల నాగరాజు, పర్సా రవి తదితరులు పాల్గొన్నారు.

## గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లాంకెట్స్ పంపిణీ




ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి ఏదులాపురంలోని ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన 450మంది విద్యార్థిని, విద్యార్థులకు గ్రేస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లాంకెట్స్‌ను బుధవారం పంపిణీ చేశారు. అలాగే టెడ్డీబేర్స్‌తో పాటు ఇతర బొమ్మలను వారికి అందజేశారు. కార్యక్రమంలో గ్రేస్ సొసైటీ నిర్వాహకుడు జాన్, హెచ్ఎంలు భాస్కర్‌రావు, విజయలక్ష్మి , ప్రేమలత పాల్గొన్నారు.

## కల్లూరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయండి



ప్రజాపక్షం/సత్తుపల్లిః హైదరాబాద్ సెక్రటేరియట్‌లో వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు దామోదర్ రాజానర్సింహను సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి, కల్లూరులో ఏర్పాటు చేయనున్న హాస్పిటల్స్ ప్రారంభోత్సవం, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు గురించి వినతి పత్రం అందజేశారు. ఈ ప్రతిపాదనలపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ కల్లూరులో హాస్పిటల్స్ ప్రారంభం డయాలసిస్ సెంటర్ ఏర్పాటు పై మంత్రి త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ భేటీలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు డా మట్టా దయానంద్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# శతాబ్ది ముగింపు సభకు తరలి రండి

**-మండల వ్యాప్తంగా జీపుజాతా**






ప్రజాపక్షం/ రఘునాథపాలెం : భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మం ఎస్ఆర్అండ్‌బిజివిన్ఆర్ కళాశాల మైదానంలో జరిగే సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు కోరారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం జీపుజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలలో నర్సింహారావు మాట్లాడుతూ ఒక ప్రత్యేక పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవ సభలు జరుగుతున్నాయన్నారు. భారతదేశంలో మునుపెన్నడు లేని రీతిలో ఆర్థిక అంతరాలు పెరిగి పోతున్నాయని దేశ సంపద కొద్ది మంది చేతిలో పోగుపడుతుందన్నారు. కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం వత్తాసుగా పనిచేస్తుందని నర్సింహారావు తెలిపారు. మరో పక్క కేంద్ర ప్రభుత్వమే మత పెద్దగా వ్యవహరిస్తూ మత ఉన్మాదానికి బీజమేస్తుందని ఆయన ఆరోపించారు. దేశ ప్రజల మధ్య చీలిక తేవడం ద్వారా మతాన్ని అడ్డుపెట్టుకుని లబ్ది పొందాలని చూస్తుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఐ అనేక చారిత్రిక పోరాటాలను నిర్వహించిందన్నారు. ప్రజల పక్షాన నికరంగా నిలబడి పోరాడిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు. మహోజ్వల చరిత్ర కలిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవాలు ఏడాది పొడవునా సాగాయని ముగింపు సభ జనవరి 18న ఖమ్మంలో జరుగుతుందని ఈ సభకు రఘునాథపాలెం మండలం నుంచి వేలాదిగా తరలి రావాలని నర్సింహారావు విజ్ఞప్తి చేశారు. చిమ్మపుడి, పాపటపల్లి గ్రామాల్లో సిపిఐ దివంగత నేత, మాజీ శాసనసభ్యుడు మహ్మద్ రజబ్ అలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, సిహెచ్ సీతామహలక్ష్మి , జిల్లా నాయకులు తాటి నిర్మల, జూలా వెంకటేశ్వర్లు, చింతల రమేష్, పొద్దుటూరు వెంకటరెడ్డి, బోడా చిన్న తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీపై పట్టు ఏ పార్టీకో..?

**- ఆమోద అభ్యర్థి ఖరారు కోసం పార్టీల కసరత్తు**
**- గెలుపు గుర్రాలనే బరిలో దింపేలా వ్యూహాలు**
**- పంచాయతీ ఎన్నికల్లో తప్పిదాలపై పార్టీల నజర్**
**- వాటిని సరిదిద్దుకుంటూ ఎత్తులు, పొత్తులపై గురి**
**- రసవత్తరంగా మారబోతున్న రాజకీయ క్రీడ**




ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ ః చలితో వణుకుతున్న ప్రజలకు ఏదులాపురంమున్సిపాలిటీ ఎన్నికలు వేడి పుట్టిస్తున్నాయి. తాజాగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలతో బిబిబిజిబిగా గడిపిన పార్టీలు ఇక్కడ సత్తా చాటేందుకు ఉవ్విళ్లురుతున్నాయి. పంచాయతీలో జరిగిన తప్పిదాలు, సరదిద్దుకునే పనిలో పడ్డాయి. పకడ్బందీ పొత్తులు, ఎత్తులు వ్యూహాలతో అధిక వార్డులను కైవసం చేసుకొని తమ జెండాను ఎగరవేసేందుకు ఎదురుచుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జరగబోవు ఎన్నికలు రసవత్తరంగా సాగబోతున్నాయి. ఖమ్మం జిల్లాకు కూత వేటుదూరంలోని ఖమ్మంరూరల్ మండలం ఒకప్పుడు అతి పెద్ద మండలంగా ఉండేది. కానీ ఖమ్మం కార్పొరేషన్‌లో కొన్ని గ్రామాలు పూర్తి స్థాయిలో విలీనం అయ్యాయి. ఈ నేపథ్యంలోనే మరోమారు విస్తరణలో భాగంగా ఏదులాపురం, పెద్దతండా, వెంకటగిరి, గుదిమళ్ల, గుర్రాలపాడు, పోలేపల్లిలోని కొంత బాగాన్ని కార్పొరేషన్‌లో విలీనం చేశారు. కానీ ఇక్కడి ప్రజలు అందుకు విముఖతను చూపడంతో మరల గ్రామ పంచాయతీలుగానే గుర్తించారు. అటు తర్వాత వీటితో పాటు మద్దులపల్లి,బారుగూడెం, గొల్లగూడెం, ముత్తగూడెం, తెల్దారుపల్లి గ్రామాలను కలిపి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఏదులాపురంమున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. అలాగే వీటన్నింటిని 32వార్డులుగా అధికారులు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు సర్పంచ్, వార్డులు, ఎంపిటీసీలకు ఓట్లేసిన ప్రజలు తొలి మున్సిపల్‌పోరులో కౌన్సిలర్లకు ఓట్లేయనున్నారు. సంవత్సర కాలంగా అధికారుల పాలనను చూసిన ప్రజలు ఇక చైర్మన్, కౌన్సిలర్ల పాలనను చూడబోతున్నారు.

**32వార్డుల్లో సందడి వాతావరణం...**

మున్సిపాలిటీలో 32వార్డులకు గాను 45,256 మంది ఓటర్లు ఉన్నారు. అందులో ఎస్సీ జనాభా 8770, ఎస్టీ4024, బిసి,ఓసీలు కలిపి మిగిలిన ఓట్లు కలిగున్నారు. జనవరి 10 లేదా 29లోపు నోటిఫికేషన్ వెలువడించి, ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. ఈ సందర్భంలోనే నోటిఫికేషన్,రిజర్వేషన్లు, ఖరారు కానున్నాయి. ఈ నేపథ్యంలో పోటికి ప్రధాన ప్రమాణికమైన రిజర్వేషన్లతో సంబంధం లేకుండా సామాజిక వర్గాల వారిగా మూడు,నాలుగు పేర్లను వార్డు వైజ్‌గా పార్టీలు రాసుకున్నాయి. ఎన్నికలపై అధికారుల ఆదేశాలతో కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి ఓట్లు, పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, డ్రాఫ్ట్‌ను త్వరితగతిన చేపించారు. కొత్త మున్సిపాలిటీ కావడం, సమయం తక్కువ ఉన్నప్పటికీ అధికారులు, సిబ్బందిని ప్రతిరోజు సమన్వయ పరుచుకుంటూ ముందస్తు పనులను పూర్తి చేశారు. అంతేకాకుండా ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు పరిస్థితిని చేరవేస్తూ ఎన్నికలకు సిద్దంగా నిలబెట్టారు.

**సర్వ సిద్ధం : కమిషనర్, ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి**



ప్రభుత్వ ఆదేశాల మేరకు, అధికారులిచ్చిన సూచనలతో మున్సిపాలిటీ ఎన్నికకై సర్వ సిద్ధం చేశాము. పోలింగ్ కేంద్రాలను గుర్తించడంతో పాటు ఓటర్ల లిస్ట్‌ను తయారు చేసి రాజకీయ పార్టీలకు అభ్యంతరాల కోసం ఇచ్చాము. అటు తర్వాత వాటిని సరి చూసి తర్వాత ఫైనల్ ఓటర్లను పబ్లిష్ చేస్తాము.

## చిన్నారులకు యూనీఫాం పంపిణీ



ప్రజాపక్షం/చింతకాని : రేపల్లెవాడ అంగన్ వాడీ కేంద్రంలోని చిన్నారులకు బుధవారం యూనీఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మడిపలిల అంబిక మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్య వైద్య రంగానికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అంగన్ వాడీ చిన్నారులకు సైతం డ్రెస్ కోడ్ పెట్టి పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. చిన్నారులకు అందించే పౌష్టికాహారం మెనూ ప్రకారం అందించాలని, ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బంధం కృష్ణ, మడిపల్లి రామ్‌ప్రసాద్, వార్డు సభ్యులు అంగన్‌వాడీ టీచర్ ఉప్పలమ్మ, ఆశా కార్యకర్తలు పద్మ, ఈశ్వరమ్మ, చిన్నారులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా జాతీయస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

**-క్రీడల్లో గెలుపు ఓటములు సహజం**
**-మంత్రి వాకాటి శ్రీహరి, సీతక్క**



ప్రజాపక్షం/మణుగూరు/పినపాక ః పినపాక మండలం ఏడూళ్ళ బయ్యారం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కంది చారిటబుల్ ట్రస్ట్, మౌర్య టెక్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ జాతీయస్థాయి క్రీడా పోటీలను రాష్ట్ర పశుసంవర్ధక, పాడి అభివృద్ధి అండ్ మత్స్య, క్రీడలు అండ్ యువజన సేవల శాఖ మంత్రి వాకాటి శ్రీహరి, పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా అండ్ శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం ఐటిడిఏ పీఓ రాహుల్ తదితరులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి కబడ్డీ పోటీల ప్రారంభోత్సవానికి జిల్లాకు విచ్చేసిన మంత్రులు వాకాటి శ్రీహరి, ధనసరి అనసూయలకు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఘన స్వాగతం పలికారు. అనంతరం మణుగూరు ప్రధాన కూడలి నుంచి సీఎం టార్చ్ ర్యాలీని మంత్రి వాకాటి శ్రీహరి ప్రారంభించారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, యువకులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఏడూళ్ల బయ్యారం జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ పతాకాన్ని మంత్రులు ఆవిష్కరించారు. జాతీయ కమిటీ పోటీల సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శన అందరి ని ఆకట్టుకుంది. అనంతరం బెలూన్లను గాలిలోకి వదిలి జాతీయ కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాకాటి శ్రీహరి మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులను ఉద్దేశించి "ఈస్ట్ ఆర్ వెస్ట్ ఇండియా ఇస్ ది బెస్ట్, ఈస్ట్ ఆర్ వెస్ట్ బయ్యారం ఇస్ ది బెస్ట్, భారత్ మాతాకీ జై" అంటూ నినాదాలు ఇచ్చారు. ఈ క్రీడా సంబరం చూస్తే సంక్రాంతి పండుగ ముందుగానే వచ్చినట్లుగా ఉందన్నారు. కబడ్డీ అనేది మన దేశంలోనే పుట్టిన సంప్రదాయ క్రీడ అని, మన మట్టిలో పుట్టిన ఈ ఆటలు మన సంస్కృతి, సువాసనను ప్రపంచానికి చాటుతాయని అన్నారు. కబడ్డీ చెమటతో, శ్రమతో ఆడే క్రీడ అని, గెలుపుఓటములు సహజమని, ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. దేశ చరిత్రలో తొలిసారిగా మారుమూల గిరిజన ప్రాంతమైన ఏడూళ్ళ బయ్యారం గ్రామంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం గర్వకారణమన్నారు. ఈ పోటీల ద్వారా బయ్యారం గ్రామం పేరు దేశవ్యాప్తంగా మారుమోగుతుందని తెలిపారు. వాజపేయి ప్రధానమంత్రి గా వున్న కాలంలో భారత్‌పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా "గెలుపుఓటములకన్నా మనసులు గెలుచుకొని రావాలి" అన్న సందేశాన్ని గుర్తు చేస్తూ, బయ్యారానికి వచ్చిన క్రీడాకారులు కూడా ఇక్కడి ప్రజల మనసులు గెలుచుకొని వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ జాతీయస్థాయి కబడ్డీ పోటీలను బయ్యారం గ్రామంలో నిర్వహించేందుకు బాధ్యత తీసుకున్న కంది చారిటబుల్ ట్రస్ట్ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ క్రీడా పోటీల నిర్వహణ కోసం వారు సుమారు ఆరు నెలల పాటు శ్రమించి, ఏర్పాట్ల నుంచి ఆతిథ్యం వరకు సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు గెలుపుఓటములను సమానంగా స్వీకరించి, అనుభవాన్ని సొంతం చేసుకోవాలని సూచించారు. చిన్నపాటి తప్పిదాలతో ఓడిపోయినప్పుడు నిరాశ చెందకుండా, గెలుపు ఇచ్చే ఆనందాన్ని, ఓటమి ఇచ్చే పాఠాలను జీవితానికి తీసుకెళ్లాలని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన చిన్నారులందరికీ ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతమైన బయ్యారంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించటం ఎంతో సంతోషకరమన్నారు. గ్రామీణ స్థాయిలో యువతలో క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఈ తరహా పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించామని, అదే విధంగా జాతీయస్థాయి పోటీలను కూడా సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వచ్చి జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు ఇది మరచిపోలేని అనుభవంగా నిలుస్తుందని అన్నారు. ఈ పోటీల ద్వారా జిల్లా ఖ్యాతి దేశవ్యాప్తంగా మరింతగా పెరుగుతుందని, క్రీడల నిర్వహణలో జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి , క్రీడా శాఖ అధికారి పరందామ రెడ్డి, టోర్నమెంట్ అబ్జర్వర్ నిర్మల్ జంగ్దే,సర్పంచ్ చంద్రావు, కంది చారిటబుల్ ట్రస్ట్ సుబ్బారెడ్డి, విశ్వ భరత్ రెడ్డి, తహశీల్దార్, ఎంపీడీవో, ఎంపీఓ, క్రీడా శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 18న ఖమ్మంకు ఆటో కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలి




ప్రజాపక్షం/మణుగూరుః ఆటో కార్మికులు వారి కుటుంబాలు, అసంఘటిత రంగా కార్మికులు జనవరి 18వ తేదీన ఖమ్మం లో జరిగే భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు లు పిలుపునిచ్చారు. బుధవారం సురక్ష బస్టాండ్ అడ్డా (ఏఐటియుసి) ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాజు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా దుర్గాల సుధాకర్, జక్కుల రాజబాబులు హాజరై మాట్లాడుతూ సీపీఐ పార్టీ 100 సంవత్సరాల ముగింపు వేడుకలను ఉమ్మడి ఖమ్మం జిల్లా లో ఖమ్మం ఎస్ఎన్‌బిజిఆర్ కాలేజీలో పెద్ద ఎత్తున కని విని ఎరుగని రీతిలో బహిరంగ సభ జరగనుందని ఈ బహిరంగ సభకు సుమారు 5 లక్షల మంది తో పెద్ద ఎత్తున జరపనున్నామని, 40 దేశాల నుండి ప్రతినిధులు, వివిధ వేషధారణలో 100 సంవత్సరాల ముగింపు వేడుకల సందర్భంగా వందమంది విద్యార్థులు, వందమంది యువకులు ,100 మంది డాక్టర్స్, వందమంది లాయర్స్, ఇలా వందమంది మహిళలు 100 సంవత్సరాల సందర్భంగా వంద రకాల ప్రజా సంఘాలతో, రెడ్ షర్ట్స్, రెడ్ వాలంటరీ, శారీస్ తో మహిళలు ఖమ్మం నగరంలో వేలాది మందితో ఎర్ర కవాతు నిర్వహించబోతున్నారని, ఈ బహిరంగ సభకు రాష్ట్రం నుండి దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరానన్నారని, కావున కమ్యూనిస్టులకు కంచుకోటైన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీ నాయకత్వంతో పాటు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున తరలి ఆ బహిరంగ సభ విజయవంతం చేయాలని, దీని కోసం మణుగూరు నుండి వేలాదిగా తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్షులు రాయల బిక్షం, ఆటో యూనియన్ అధ్యక్షులు ఏఎం. రాజు, గౌరవ అధ్యక్షులు చారి, ఆటో యూనియన్ నాయకులు వీరభద్రం శంకర్, సాంబ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## కోడిపందాలు, ఇసుక అక్రమ రవాణా నిర్వహిస్తే చర్యలు తప్పవు



ప్రజాపక్షం/సత్తుపల్లిః కోడి పందేలు నిర్వహించినా, ఇసుక అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని సత్తుపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీహరి తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, పేకాట జరగకుండా తీసుకుంటున్న చర్యలలో భాగంగా గతంలో సత్తుపల్లిలో కోడి పందేలు, జూదం నిర్వహించిన వారిని, అదే విధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వారికీ బుధవారం స్థానిక స్టేషన్లో కౌన్సిలింగ్ నిర్వహించి తహశీల్దార్ ఎదుట 17 మందిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని చైనా మాంజాను విక్రయించే దుకాణాలు, గోదాంలు, మార్కెట్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. చైనా మాంజాను ఉపయోగించి గాలిపటాలు ఎగురవేసే సమయంలో అనేక పక్షులు, పశువులు, ప్రజలు, ముఖ్యంగా బైక్‌లపై ప్రయాణించే వారు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. చైనా మాంజాను విక్రయించడం, కొనుగోలు చేయడం పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే జైలు శిక్షతో పాటు రూ.10 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు.

## కుష్టువ్యాధి నివారణకు అవగాహన ముఖ్యం



ప్రజాపక్షం/చంద్రుగొండ : కుష్టు వ్యాధి నివారణకు అవగాహన ముఖ్యమని డిస్ట్రిక్ట్ పారా మెడికల్ ఆఫీసర్ ఐ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న 24 మందికి నిర్థారణ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ వ్యక్తికైనా శరీరంపై నొప్పి లేకుండా పుట్టమచ్చలు, మచ్చలు ఉంటే వెంటనే ఆసుపత్రికి రావాలన్నారు. కుష్టు వ్యాధికి తగిన మందులు అందుబాటులో ఉన్నాయని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. మంచి ఆహార నియమాలు పాటిస్తూ, మందులు క్రమం తప్పకుండా వాడితే నివారణ సాధ్యమన్నారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు వెంకట ప్రకాష్, హెచ్ఎస్ పూర్ణరావు, హెచ్ఏ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## కోతులు, కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలి



ప్రజాపక్షం/కారేపల్లి: కోతులు, కుక్కల వల్ల సింగరేణి మండల వ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి దాడుల వల్ల మహిళలు, చిన్నారులు, వృద్దులు గాయాలపాలవుతున్నారని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ సింగరేణి మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు గుగులోత్ తేజ నాయక్ అన్నారు. మంగళవారం ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సింగరేణి మండల ఎంపీవోకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. సింగరేణి మండల వ్యాప్తంగా కోతులు, కుక్కల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అదే విధంగా కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయితీ సర్పంచ్ స్థానిక ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గ్రామాలలో కోతులు, కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని, వీధిలైట్లు ఏర్పాటు, బ్లీచింగ్, ఫాగింగ్ చేయాలని, గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు వెంటనే చేయాలలన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామణ ఉపాధి హామీ పథకం కింద వెంటనే పనులను గుర్తించి నిధులు కేటాయించి తక్షణమే పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు బిక్కసాని భాస్కర్, వద్దే వెంకటేశ్వర్లు, పులకాని సత్తిరెడ్డి, బాలు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## 9న, సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికలు

ప్రజాపక్షం/పాల్వంచ : ఈ నెల 9వ తేది ఉదయం 9 గంటల నుండి పాల్వంచలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్, జూనియర్ కళశాలలో జిల్లా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తున్నామని జిల్లా అసోసియేషన్ సెక్రటరీ కే. మహీధర్ బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8, 10, 12, 14, 20 సంవత్సరాల బాల బాలికలకు 60, 200, 300 మీటర్లు లాంగ్ జంప్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, షాట్‌పుట్ విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. మెరగైన ప్రతిభ కనభరిచిన క్రీడాకారులను ఈ నెల 18వ, ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 9వ, తేది ఉదయం 8 గంటలకు కళాశాల పిడి మల్లేష్‌కు రిపోర్టు చేయాలని, మరిన్ని వివరాల కోసం జిల్లా అథ్లెటిక్స్ కోచ్ నాగేంద్ర ( 8328616937 ) సంప్రదించాలని సూచించారు.

## జిఎంను కలిసిన సిపిఐ నాయకులు



ప్రజాపక్షం/ఇల్లందు: సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే సారయ్య ఆధ్వర్యంలో తిలక్‌నగర్, విజయలక్ష్మీనగర్, గ్రామ వార్డు మెంబర్లు, సిపిఐ నాయకులు సింగరేణి జిఎం వీసం కృష్ణయ్యను కలిసి శాలువా కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. తిలక్‌నగర్, విజయలక్ష్మీ నగర్ గ్రామ పంచాయితీలో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలనీ, విద్యుత్, నీటి సమస్యను పరిష్కరించాలని జిఎంకు వినతి పత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో ఏఐటియూసి బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, మండల కార్యదర్శి బొబ్బిశెట్టి సత్యనారాయణ, ఉపసర్పంచ్ షేక్ కాసీం, వార్డు మెంబర్లు రెంటాల సదానందం, కళావతి, సనప సరోజ, గుగులోతు మల్లిక, సిపిఐ నాయకులు గుగులోత్ కృష్ణ, మంచాల వెంకటేశ్వర్లు, తాండ్ర లక్ష్మీ నారాయణ, గుడిమిల్లి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం




ప్రజాపక్షం/అశ్వాపురం: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పాములపల్లి గ్రామంలో జరుగుతున్న శీతాకాల ప్రత్యేక శిబిరం బుధవారం 6వ రోజుకు చేరుకుందని, ఈసందర్భంగా గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చిట్టిబాబు అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఈనెల 8న గురువారం రోజు ఉదయం 10గంటలకు ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు వేడుక ఉంటుందని ప్రజలందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవి బండారుపల్లి, గ్రామ సర్పంచ్ కె సరిత, వైద్య బృందం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# వాస్తవ వార్తల వేదిక ప్రజాపక్షం

## -ప్రజాపక్షం ఆఫీస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన బాగం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** వాస్తవ వార్తల వేదికగా 'ప్రజాపక్షం' దినపత్రిక నిలుస్తుందని నవచేతన విజ్ఞాన సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ప్రజల అవసరాలను ప్రభుత్వం దృష్టికి, ప్రభుత్వ పథకాలను ప్రజల ముంగిటకు చేరుస్తూ నిష్పక్షపాత్ర పోషిస్తున్న ప్రజాపక్షం మరింత పురోగమించాలన్నారు. బుధవారం ప్రజాపక్షం ఆఫీస్ క్యాలెండర్లను స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా పాత్ర సమాజంలో ప్రముఖమైందని ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల పక్షాన పనిచేసే మీడియా కనుమరుగవుతుందన్నారు. వ్యక్తిగత అవసరాలు లేదా పాలక వర్గాలకు వత్తాసు పలికే పత్రికలు పెరిగిన నేపథ్యంలో ప్రజాపక్షం దినపత్రిక ప్రజా పోరాట వేదికగా నిలిచిందన్నారు. మరింత పురోగమించాలని ఆయన కోరారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు,



కొండపర్తి గోవిందరావు, ప్రజాపక్షం ఎడిషన్ ఇంచార్జి ఏనుగు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, ప్రజా సంఘాల నాయకులు గాదె లక్ష్మి నారాయణ, ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మౌంట్ ఎవరెస్ట్ అధిరోహణకు సహకరించండి

## ముఖ్యమంత్రిని కలిసిన వియం బంజర వాసి



**ప్రజాపక్షం/పెనుబల్లిః** సత్తుపల్లి నియోజకవర్గ శాసన సభ్యురాలు డా మట్టా రాగమయి దయానంద్ సహాయ సహకారాలతో బుధవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని అథ్లెట్ మౌంటెనియర్ బర్మావత్ మోతికుమార్ ప్రపంచంలోనే అత్యున్నత శిఖరం మౌంట్ ఎవరెస్ట్‌ను అధిరోహించేందుకు అవసరమైన ప్రభుత్వ సహాయాన్ని కోరుతూ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మోతికుమార్ తన జీవిత నేపథ్యాన్ని, కఠిన పరిస్థితుల్లో సాగుతున్న తన ప్రయాణాన్ని ముఖ్యమంత్రి వివరించారు. అత్యంత నిరుపేద కుటుంబానికి చెందిన వియం బంజర వాసి మోతికుమార్ తల్లిదండ్రులు పండ్ల విక్రయంతో జీవనం కొనసాగిస్తున్నారని, స్వంత నివాస గృహం కూడా లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ, అనేక అడ్డంకులను అధిగమిస్తూ పర్వతారోహణ రంగంలో ముందుకు సాగుతున్నట్లు సియం కి వివరించాడు. ఇప్పటికే ఆయన ఆఫ్రికా ఖండంలో అత్యున్నత శిఖరం మౌంట్ కిలిమంజారో (5,895 మీటర్లు), యూరప్ ఖండంలో అత్యున్నత శిఖరం మౌంట్ ఎల్బ్రస్ (5,642 మీటర్లు)ను విజయవంతంగా అధిరోహించినట్లు తెలిపాడు. ఇప్పుడు ప్రపంచంలోనే అత్యున్నత శిఖరం మౌంట్ ఎవరెస్ట్ (8,849 మీటర్లు)ను అధిరోహించడమే తన జీవిత లక్ష్యమని తెలిపారు. ఈ ఘనత ద్వారా తెలంగాణ రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు రాష్ట్రంలోని నిరుపేద యువతకు స్ఫూర్తిగా నిలవాలనే ఆశయంతో ఈ సాహస యాత్రను చేపడుతున్నట్లు మోతికుమార్ వెల్లడించారు. మోతికుమార్ విజ్ఞప్తికి స్పందించిన గౌరవ ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన సహకారం అందించేందుకు సంబంధిత అధికారులకు సూచనలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి కూడా పాల్గొని మోతికుమార్ ఎవరెస్ట్ యాత్రకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మోతికుమార్ ముఖ్యమంత్రి, సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## ఏసిపి వసుందర యాదవ్

**ప్రజాపక్షం/వైరాః** సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ ఉచ్చులో పడి మోసపోవద్దని వైరా ఏసిపి ఇంచార్జి వసుందర యాదవ్ అన్నారు. బుదవారం వైరా మండలం ముసలిమడుగు ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వసుందర యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని, సంబంధం లేని యాప్‌లు ఉపయోగించవద్దని, అదేవిధంగా మీ తల్లిదండ్రులను కూడా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండేవిధంగా సూచనలు చేయాలని అన్నారు. రకరకాల నకిలీ యాప్‌లు లోన్‌లు ఇస్తామని చెబుతూ ఉంటారని వారి మాటలను నమ్మి మోసపోవద్దని సూచించంఆరు. తెలియని అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన ఎలాంటి లింకులను ఓపెన్ చేయవద్దని, వాటిని ఓపెన్ చేస్తే ఇబ్బందులు పడతారని, ఏపికె ఫైల్స్ డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయవద్దని సూచించారు. మీరు లెఆంటివి ఆన్‌లైన్‌లో బుక్ చేయకుండానే మీకు పార్సిల్ వచ్చిందని వచ్చే ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉండాలని, మీకు తెలియని వారికి మీ వివరాలు చెప్పవద్దని అన్నారు. అదేవిధంగా రోడ్డు భద్రత నియయ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, మొబైల్ చూస్తూ డ్రైవ్ చేయవద్దని, ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలని, కార్లు ఇతర వాహనాలు తోలేటప్పుడు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అతివేగంగా వాహనాలను నడిపి మరికరి ప్రమాదానికి గురికావద్దని , ముఖ్యంగా వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పుప్పాల రామారావు, పాఠశాల ప్రిన్సిపాల్ మాధవిలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






# తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అందించే పథకాలపై కళాజాతా

**ప్రజాపక్షం/పెనుబల్లిః** తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలు పూర్తిస్థాయిలో సద్వినియోగపరచుకోవాలని పెనుబల్లి బ్రాంచ్ మేనేజర్ జి సురేష్ అన్నారు. బుధవారం ఆ శాఖ ఖమ్మం రీజియన్ మేనేజర్ నాబార్డ్ సౌజన్యంతో మండల పరిధిలోని పంచాయతీ కార్యాలయంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ సురేష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి ప్రధానమంత్రి సురక్షణా బీమా, హెల్త్ ఇన్సూరెన్స్, రైతుబంధు రుణాలు, ఎడ్యుకేషన్ లోన్, హౌసింగ్ లోన్, వాహన లోన్, గోల్డ్ లోన్, ముద్ర లోన్ మొదలగు బ్యాంక్ అందించే పథకాలు సేవలు బ్యాంకు పరిధిలోని గ్రామీణ ప్రజలు రైతులు వినియోగదారులు సద్వినియోగ పరుచుకోవాలి అన్నారు. పైన సూచించిన పథకాలు వివరాలు అందుబాటులో బ్యాంకులో తెలుసుకోవచ్చు అన్నారు. విభూతి బ్రదర్స్ కళాజాత నిర్వహించగా గ్రామంలోని డ్వాక్రా మహిళలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కళ్ళజాత నిర్వహించిన వారిలో శ్రీనివాసరాజు, ఏడుకొండలు ఉన్నారు. అలాగే నేడు కొండ్రుపాడు, రేపు తాళ్లపెంట గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు.



# బిఆర్ఎస్ ర్యాలీలో వైసిపి హడావుడి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** బిఆర్ఎస్ ర్యాలీలో వైసిపి జెండాలు రెపరెపలాడటం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. బుధవారం కేటిఆర్ పర్యటన సందర్భంగా బిఆర్ఎస్ శ్రేణులు జిల్లా సరిహద్దుల వద్ద స్వాగతం పలికేందుకు వచ్చాయి. బిఆర్ఎస్ జెండాలతో పాటే జగన్ ఫోటోతో ఉన్న వైసిపి జెండాలతో కార్యకర్తలు హల్‌చల్ చేశారు. జై జగన్, జై కేటిఆర్ అంటూ రాసిన ఫ్లెక్సీలను ప్రదర్శించారు. మొత్తంగా బిఆర్ఎస్ సమావేశంలో జగన్ పార్టీ జెండాలు రెపరెపలాడటం రాజకీయ అంశంగా మారింది.

# ఏకరూప దుస్తులు పంపిణీ



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండల పరిధిలోని చిన్నబీరవల్లి గ్రామపంచాయతీ నందు అంగన్వాడీ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా అందించిన నూతన ఏకరూప దుస్తులను గ్రామ సర్పంచ్ చంద్ర సరిత చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఉన్న విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన కోసం బిల్డింగ్ పనులు నిర్వహించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బాణాల రామారావు, పేరబత్తిన కృష్ణారావు, గ్రామ పెద్దలు చంద్ర శ్రీనివాసరావు, అంగన్వాడీ టీచర్లు మర్సకట్ల మరియమ్మ, మార్తి నాగలక్ష్మి , ఆయా మాచిబోయిన పద్మ, అంగన్వాడీ పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పిండి అయిన దొడ్డు బియ్యం



**ప్రజాపక్షం/కల్లూరుః** అక్రమ వ్యాపార బియ్యం .కల్లూరు మండల పరిధిలోని 31 రేషన్ దుకాణాలలో ఐదు నుంచి పది బస్తాల వరకు కొన్ని నెలలుగా లావు బియ్యం పందికొక్కులకు ఎలుకలకు ఆహారంగా మారి ముక్కిపోయి పిండిగా మారుతున్నాయి. దీనివలన ప్రభుత్వానికి వేటికీ ఉపయోగించుకోలేకపోవటం వలన ప్రభుత్వానికి నష్టం వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతోపాటు సివిల్ సప్లై గోడౌన్ లో కూడా సుమారుగా 500 క్వింటాలపైగా పాడైపోతున్నట్లు సమాచారం. ఈ విషయమై సివిల్ సప్లై అధికారులను వివరణ కోరగా అట్టి సమాచారాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపించడం జరిగిందని తెలిపారు.

# లక్షలు వెచ్చించి ...లక్షణంగా వదిలేసి



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు లోని కల్లూరు లోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 2014 సంవత్సరంలో లక్షలతో గృహ నిర్మాణ శాఖ సాంకేతిక కార్యాలయం నిర్మించి లక్షణంగా వదిలేశారు. 2014వ సంవత్సరంలో గృహ నిర్మాణ శాఖ కార్యాలయం సుమారు 10 లక్షలతో ఆనాడు ప్రభుత్వం ఆ శాఖ అధికారులకు మోడల్ గా గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఉపయోగపడే విధంగా ఒక మోడల్ గా నిర్మించారు. తర్వాత ప్రభుత్వాలు మారడం ఉమ్మడి రాష్ట్రాలు విడిపోవడంతో దానిని ప్రస్తుతం లక్షణంగా నిర్లక్ష్యంగా వదిలేసి నిరుపయోగంగా మార్చారు. అట్టి కార్యాలయమును నిరుపయోగంగా ఉంచకుండా ఉపయోగకారిగా వేరే కార్యాలయాలకు ఉపయోగించు కోవాలని మండల ప్రజలు సంబంధిత శాఖ అధికారులను ప్రజలు కోరుతున్నారు. కార్యాలయాలు లేక చాలా కార్యాలయాలు కల్లూరు పేరుతోవేరే ప్రాంతాలకు వెళ్లాయని ఈ భవనాన్ని వినియోగించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# చెనా మాంజా అమ్మినా, వాడినా కేసు నమోదు



**ప్రజాపక్షం/ మధిరః** మనుషుల ప్రాణాలకు ముప్పుగా మారిన చైనా మాంజ అమ్మినా, వాడినా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మధిర టౌన్ సిఐ రమేష్ హెచ్చరించారు. బుధవారం స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం సందర్భంగా పతంగులు ఎగిరివేసే పిల్లలు, పెద్దలు ఎవరైనా చైనా మాంజను వాడకూడదని, చైనా మాంజ వాడాకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిషేదించిందని తెలిపారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా ఉన్న చైనా మాంజ వలన కొన్ని సందర్భాల్లో ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. సంక్రాంతి పర్విదినాన్ని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ప్రజలు ఎవరైనా చైనా మాంజను అమ్మినా, నిల్వ ఉంచినా దానికి సంబంధించిన సమాచారం అందిస్తే వారికి ఆకర్షణీయమైన పతంగులు బహుమతులుగా అందచేస్తామన్నారు.

# టిఎస్‌యూటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని మైనార్టీ గురుకుల కళాశాల నందు టిఎస్‌యూటిఎఫ్ క్యాలెండర్ ,డైరీని ప్రిన్సిపాల్ ఎస్కే షమీం చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా ఉపాధ్యాయులకు, ఉద్యోగులందరికీ ఉపయోగపడే విధంగా నూతన క్యాలెండర్, డైరీని టిఎస్‌యూటీఎఫ్ సంఘం ఏర్పాటు చేయటం అభినందనీయని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యూటీఎఫ్ మైనార్టీ గురుకులాల వింగ్, ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు ఎండి.రఫీ, కళాశాల ఇన్‌చార్జి ఎల్.రవికుమార్, పాఠశాల, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మరో వందేళ్లయినా ప్రజాక్షేత్రంలోనే..

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా**





**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ఈ దేశంలో శత వసంతాలు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అని, తొలినాళ్ల నుండి ఇప్పటి వరకు పేదలు, బడుగు, బలహీన వర్గాలు కోసం పోరాటాలు సాగించిందని, రానున్న మరో వందేళ్లు కూడా ఇదే స్ఫూర్తితో ప్రజా క్షేత్రంలో మనగలమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్కి సాబీర్ పాషా అన్నారు. జూలూరుపాడు చేరుకున్న సిపిఐ ప్రచార జాతకు ఘన స్వాగతం పలికి ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. కొమరం భీమ్, డా బిఆర్ అంబేద్కర్ విగ్రహానిలకు పూలమాలలు వేసిన అనంతరం సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో సాబీర్ పాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వలన ఈ దేశాన్ని అంబానీ ఆదానీలకు నరేంద్ర మోడీ మరింత బలవంతుడిని చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ జిల్లాలో పేద ప్రజలకు పోడు భూమల పట్టాలు ఇప్పించిన ఘనత సిపిఐ కి ఉందని, దేశ స్వతంత్ర ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలకు సమీకరించి పోరాటాలలో అగ్ర భాగాన నిలిచారని కార్మిక విద్యార్థి రైతు మహిళ యువజన సంఘాలు నిర్మించి దేశ సమైక్యత కోసం పోరాటలు నిర్వహించారని ఖమ్మం జిల్లా కేంద్రంలో 5 లక్షల మందితో జరిగే బహిరంగ సభకు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వర్లు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సారెడ్డి పుల్లారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య, వేల్పుల మల్లికార్జున్, మున్నా లక్ష్మి కుమారి, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా చట్ట విరుద్ధమైన చర్యలను భారత ప్రభుత్వం ఖండించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** వెనిజులా పై అమెరికా చేపట్టిన చట్ట విరుద్ధమైన చర్యలను భారత ప్రభుత్వం ఖండించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిదినేని కర్ణ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం నేలకొండ పల్లి మండల కేంద్రము లోని కర్నాటి కృష్ణయ్య భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికాలోకి మాదకద్రవ్యాలను చేరవేస్తున్నారని పేరిట వెనిజులా అధ్యక్ష భవనంపై మెరుపు దాడులకు పాల్పడి, రెండు గంటల్లోనే మదురోను, అతని భార్యను ఎత్తుకెళ్లడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడిలో సైనికులతో పాటు ప్రజలు మరణించారని, వందల మంది గాయపడ్డారని అన్నారు. ప్రపంచంలోనే ఎక్కువ సమరు నిల్వలు ఉన్న దేశం వెనిజులా అని, వాటిని కొల్లగొట్టేందుకే డ్రగ్ స్ టెర్రరిజం అనే ముద్ర వేసి ఆ దేశ సర్వభౌమాత్వన్ని కాలరాసిందని మండిపడ్డారు. అంతర్జాతీయ చట్టాలను సాహితం లెక్కచేయని అమెరికా సామ్రాజ్యవాది ట్రంప్ అనైతిక చట్ట విరుద్ధమైన చర్యలను ఖండించి, వెనిజులా ప్రజలకు మద్దతుగా భారత ప్రభుత్వం బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. న్యూయార్క్ జైల్లో అక్రమంగా నిర్బంధించిన మదురోను, అతని భార్యను విడుదల చేసి, వెనిజులాలో మోహరించిన సైనిక బలగాలను వెనకకు మళ్లెలా అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ప్రధాని మోదీ పట్టాలని కోరారు. చమురు నిల్వలు, అపార సంపదలో ఉన్న దేశాలపై తన ఆధిపత్యాన్ని ప్రదర్శించే క్రమంలో చేస్తున్న అన్ని రకాల అహంకార పూరితమైన దురక్రమణ యుద్ధ బెదిరింపులు, హెచ్చరిక చర్యల పట్ల ఐక్యరాజ్యసమితి భద్రత మండలి జోక్యం చేసుకొని ప్రపంచశాంతిలో భాగంగా ప్రపంచ మానవ మనుగడకు పూనుకోవాలని కోరారు. యుద్ధ పిపాసి డోనాల్డ్ ట్రంప్ కు వ్యతిరేకంగా మూడవ ప్రపంచ దేశాల ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, ఏఐవైఫ్ పాలేరు నియోజకవర్గ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, కిరణ్, చేన్నబోయిన మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నం బ్రహ్మయ్యను పరామర్శించిన కెటిఆర్



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మాతృ వియోగానికి గురైన నేలకొండపల్లి మండల బి.ఆర్.ఎస్ అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్యను బుధవారం ముజ్జుగూడెం గ్రామంలోని ఆయన నివాసంకు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందర్శించి పరామర్శించారు. మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య మాతృమూర్తి ఉన్నం అచ్చమ్మ మంగళవారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మం పర్యటన ముగించుకుని నేరుగా ముజ్జుగూడెం గ్రామంను సందర్శించారు. మృతురాలు ఉన్నం అచ్చమ్మ చిత్రపటంకు కేటీఆర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అచ్చమ్మ ఆత్మకు శాంతి కలగాలని ఆయన ప్రార్థించారు. మృతురాలు అచ్చమ్మ కుమారుడు ఉన్నం బ్రహ్మయ్య, వారి కుటుంబ సభ్యులకు ఆయన తన ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు. ఉన్నం బ్రహ్మయ్యను ఆయన కుటుంబ సభ్యులను కేటీఆర్ ఓదార్చారు. బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పాలేరు, సత్తుపల్లి మాజీ మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్ రెడ్డి, సండ్ర వెంకట వీరయ్య, జిల్లా, మండల బి.ఆర్.ఎస్. నాయకులు మరికంటి ధనలక్ష్మి, నాగుబండి శ్రీనివాసరావు, మరికంటి రేణుబాబు, కోటి శ్రీనివాసరావు, తన్నీరు సత్యనారాయణ,కుండా శ్రీనివాసరావు, ఎండి వాజిద్, షేక్. హుస్సేన్, శీలం వెంకటలక్ష్మి, అనగాని నర్సింహారావు, వెన్నబోయిన శ్రీను, గొలుసు రవి, బొడ్డు వసంత, దండా రంగయ్య, జటంగి వెంకటేశ్వర్లు, భువనగిరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు పిహెచ్‌సి తరలింపు

**చెరువుమాధారంలో వైద్య సేవలు ప్రారంభం**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎట్టకేలకు చెరువుమాధారం తరలించారు. బుధవారం నుంచి వైద్య సేవలు ప్రారంభించారు. నేలకొండపల్లి సిహెచ్సీపీహెచ్సీ లు ఒకే ఆవరణలో ఉన్న వాటిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను చెరువు మాధారం కు తరలించాలని గతంలో కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వివిధ కారణాల వలన తరలింపు జాప్యం జరిగింది. మంగళవారం జిల్లా కలెక్టర్ వైద్యాధికారులతో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. బుధవారం నుంచి చెరువుమాధారంలో వైద్య సేవలు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ మేరకు స్థానిక వైద్యులు, సిబ్బంది సామాగ్రిని తీసుకెళ్లి వైద్య సేవలు ప్రారంభించారు. ఈ పీహెచ్సీ పరిధిలో చెరువుమాధారం, పైనంపల్లి, మంగాపురం, నేలకొండపల్లి,సింగారెడ్డి పాలెం, బుద్దారం ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం 19 మంది వైద్యులు, సిబ్బంది చెరువుమాధారం పీహెచ్సీ కి తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రావణ కుమార్ మాట్లాడారు. ఇక నుంచి చెరువుమాధారంలో వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. త్వరలోనే అధునాతన సౌకర్యాలతో మరిన్ని సేవలు అందించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లుతెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నాగమణి, డాక్టర్ సన్న శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ప్రజా సమస్యలపై నిక్కచ్చిగా వార్తలు రాస్తూ ప్రజల మన్ననలను పొందుతున్న ప్రజాపక్షం దినపత్రిక 2026 క్యాలెండర్‌ను జూలూరుపాడు మండల కేంద్రం లో బుధవారం సిపిఐ పార్టీ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజల కోసం అనే నినాదంతో ప్రజాపక్షం దినపత్రిక విజయవంతంగా ప్రజల గొంతుక వినిపిస్తోందని, ప్రజాపక్షం దినపత్రిక విలువలతో కూడిన వార్తలతో సమాజానికి దిశా నిర్దేశం చేస్తోందన్నారు. ప్రజాపక్షం పత్రికను ఆదరించాలన్నారు. ప్రజాపక్షం క్యాలెండర్లో వేస్తున్న సీనరీలు, డిజైన్లు చాలా చక్కగా ఉంటాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మండలకార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, షేక్ నాగులు మీరా, మండల విలేకరి చాపలమడుగు నరసింహారావు, షేక్ చాంద్ పాషా, జర్నలిస్ట్ షేక్ బుడెన్ పాషా పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే రాగమయి





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని, మంత్రి తుమ్మల నాగేశ్వరావుతో కలిసి సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గం లోని పలు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్, రాష్ట్ర యువ నాయకులు తుమ్మల యుగంధర్, సత్తుపల్లి ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్ తో, ఎమ్మెల్యే పీఏ కిషోర్ పాటు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మంజుల



**ప్రజాపక్షం/కారేపల్లి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు, మాజీ ఎంపీపీ పగడాల మంజుల కలిశారు. హైదరాబాద్‌లో వారి స్వగృహం నందు రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి విషయాలపై తెలిపారు.

# కేటీఆర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన దేవిక



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై నేటికీ ఆరు గ్యారెంటీల అమలు ఎప్పుడని. సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. జూలూరుపాడు మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన నాయకురాలు, గాంధీనగర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి వైరా నియోజకవర్గ నాయకులు లకావత్ గిరిబాబు ఆధ్వర్యంలో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా, దేవికా కు కేటీఆర్ శాలువా వేసి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్బంగా కేటీఆర్ మాట్లాడుతూ స్థానిక పంచాయతీ ఎన్నికల్లో ఒంటరిగా పోరాడి కేవలం 3 ఓట్లతో ఓడినా, నైతికంగా నువ్వే గెలిచావు. భయపడకు, బాధపడకు, నీవెంట ప్రజలు ఉన్నారు. ప్రజల కోసం కేటీఆర్ ఉన్నారు. మీకోసం ఎంతటి మారు మూల ప్రాంతం అయినా మీకోసం తప్పకుండా వస్తాను. మీ కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటానని దేవికా కు కేటీఆర్ హామీ ఇచ్చారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ రైతుబంధు, రైతు బీమా, రూ. లక్ష, తులం బంగారం, రూ.4 వేల పింఛన్ వంటి పథకాలను అమలు చేయడంలో రేవంత్ సర్కార్ విఫలమైందన్నారు. రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా. ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ ప్రజలు, రైతుల తరపున పోరాడుతూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో గాంధీనగర్ పంచాయతీ నాయకులతో పాటు అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఫోన్ కాల్స్ పట్టించుకోని ఐబీ డీఈ రత్నకుమార్

**ప్రజాపక్షం/కూసుమంచి :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు సేవలు అందించే విషయంలో అధికార యంత్రాగం ఎంతో కీలకమైందో ప్రజలకు అన్ని వేళల సేవలందించాల్సిన అధికారులు ఏ స్థాయి వారైనా స్పందించకపోతే ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కొందరు అధికారులు అయితే స్త్రీ పురుష భేదం లేకుండా ఏ డిపార్ట్మెంట్ అయినా ఇలా కబురు ఉంటే చాలు చిన్నవారైన పెద్దవారైనా ఎంతో పారదర్శకంగా స్పందించి ఏదో ఒక సమాధానం అయితే చెబుతారు. ప్రభుత్వ అధికారులు అని బాధ్యతగా ఫీల్ అవుతారు, కానీ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ నీటి పారుదల శాఖలో పని చేస్తున్న డిఈ రత్నకుమారి గురించి చెప్పాలంటే ఆమె ఎప్పుడూ ఫోన్ కాల్స్‌కు బాధ్యత వహించదని ప్రజల్లో ఎప్పటి నుంచో విమర్శ ఉన్నది. ఆమెకు చెరువు వరదలకు తెగిపోయిన, నీటి కాలువలు తెగిపోయిన, చెరువు మట్టి అక్రమార్కులు ఎత్తుకు పోయిన, కాలువల మట్టి ఎత్తుకు పోయిన, కాలువల నీరు పారుతున్న నీరు పారకపోయినా నాకేమీ పట్టదు అన్నట్లు వ్యహరిస్తుందని జనం నుండి విమర్శ వినిపిస్తుంది. నీటి పారుదలకు సంబంధించిన విషయంపై ఎవ్వరు ఫోన్ చేసినా (9676576332)ఎప్పుడు నాది కాదు అన్నట్లు వ్యవహరించడం శోచనీయంగా మారింది. డిఈ రత్నకుమారి కంటే పై స్థాయి అధికారులకు రైతులు ప్రజలు ఎవరు ఫోన్ చేసినా వెంటనే స్పందించి సమాధానం చెబుతున్నారు. కానీ రత్నకుమారికి అవేమి పట్టనట్లు వ్యవహరించడం ఎంతో విడ్డూరంగా ఉందని జనం అంటుకున్నారు. మండలం నుండి రైతులు ప్రజలు ఎందుకు ఫోన్ చేస్తారో గుర్తించలేనప్పుడు సెలవు పెట్టుకుంటే ప్రజాధనం సద్వినియోగం అవుతుందని, ప్రజలకు అందుబాటులో లేకుండా ప్రజాధానం దుర్వినియోగం అవుతుందని కూసుమంచి మండల ప్రజలు ఆమెకు హితవు పలుకుతున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉన్న డిఈ రత్నకుమారిపై నీటిపారుదల శాఖ ఉన్నత స్థాయి అధికారులైన జోక్యం చేసుకొని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కూసుమంచి మండల ప్రజలు కోరుతున్నారు.

# వందేండ్లయినా ప్రజాదరణ తగ్గని ఏకైక పార్టీ సిపిఐ

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా
- ప్రచార జాతాకు ఘన స్వాగతం
- గౌతంపూర్ నుండి బైపాస్ రోడ్ వరకు భారీ బైక్‌ర్యాలీ





ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : స్వాతంత్ర్యోద్యమం నుండి పురుడు పోసుకున్న భారత కమ్యూనిస్టు పార్టీ వందేండ్లయినా ప్రజాధరణ తగ్గకుండా అజేయంగా నిలిచిందని, ప్రజా ఉద్యమాలతో భారత గడ్డపై మరో నూరేండ్లయినా వన్నె తగ్గనివబోమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. సిపిఐ శతవసంతాల ముగింపు సంధర్భంగా ఈ నెల 18న, ఖమ్మం పట్టణంలో జరుగనున్న బహిరంగసభ విజయవంతానికి చేపట్టిన ప్రచార జాతా బుధవారం చుంచుపల్లి మండలం గౌతంపూర్ సింగరేణి ప్రాంతానికిచేరుకుంది. ప్రచార బృందానికి సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గౌతంపూర్ నుండి రుద్రంపూర్, రామవరం, కొత్తగూడెం పోస్ట్‌ఫీసు మీదుగా చుంచుపల్లి మండలం విద్యానగర్ బైపాస్ సెంటర్‌కు చేరుకొంది. ఈ సందర్భంగా ప్రధాన సెంటర్‌లలో జరిగిన సభల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా మాట్లాడుతూ వందేండ్లుగా ప్రజలతో మమేకమై ప్రజా పోరాటాల్లో మడమ తిప్పబోమని అదే సిపిఐకి బలమన్నారు. గ్రామీణ ఉపాధిహామీ చట్టం, సమాచార హక్కు చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి అనేక చట్టాలు సిపిఐ సాధించిన పోరాట ఫలితాలే అన్నారు. జిల్లాలో భూ పోరాటాలకు నాంధీ పలికి పేదలకు గూడు కల్పించామన్నారు. పోడు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేదల పక్షాన పోరాడి భూములపై హక్కుల కల్పించినట్లు తెలిపారు. రైతు, యువజన, విద్యార్థి, మహిళా ఉద్యమాలతో ప్రజలకు మరింత చేరువైనట్లు తెలిపారు. నియోజకవర్గంలో సిపిఐకి తిరుగులేని, త్వరలో జరగనున్న కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో విజయ దుందుబి మోగిస్తామని స్పష్టం చేశారు. జాత సందర్భంగా డా. బిఆర్ అంబేద్కర్,శేషగిరి రావు, బందెల నర్సయ్య, డా.జయశంకర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూల మాలలు వేశారు. తెలంగాణ అమర వీరుల స్థూపానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, జి వీరస్వామి, వాసిరెడ్డి మురళీ, కంచర్ల జమలయ్య, ఫహీం, వంగావెంకట్, వట్టికొండ మల్లికార్జునరావు, భూక్యా శ్రీనివాస్, నిమ్మల రాంబాబు, పాటి మోహన్ రావు, కొత్తూరు రవి, సుధాకర్, వాడె రాములు, నగేష్, గోపికృష్ణ, పెయ్యల రంగారావు, యూసూఫ్, ధర్మరాజు, బండి నర్సింహా, దుర్గ, సత్యనారాయణాచారి పాల్గొన్నారు.

# భక్తులకు మెరుగైన రవాణా సేవలు అందించాలి

-మేడారం జాతర సమీక్షలో రీజినల్ మేనేజర్ సరిరామ్




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా భక్తులకు మెరుగైన రవాణా సేవలను అందించాలని ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ తెలిపారు. బుధవారం మేడారంలో జాతరను పురస్కరించుకుని ఖమ్మం రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజీ సూపర్ వైజర్లు, డిపో ఎంప్లాయి వెల్ఫేర్ కమిటీ సభ్యులతో రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం మేడారంలో ఏర్పాటు చేసిన రవాణా సౌకర్యాలను ఆర్ఎం పరిశీలించారు. సమ్మక్క సారలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. సూపర్‌వైజర్లు, అధికారులు తమ అనుభవాలను సమీక్షలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ సూపర్‌వైజర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించేలా, భక్తుల అవసరాలకు అనుగుణంగా బస్సులను ఆపరేట్ చేసేలా ప్రోత్సహించాలన్నారు. భక్తులు మెరుగైన సేవలు అందిస్తూ మేడారం జాతర విజయవంతం కావడంలో ప్రతి ఉద్యోగి భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, డిపో మేనేజర్లు, పర్సనల్ ఆఫీసర్ సంపత్, ట్రాఫిక్, గ్యారేజీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ అండ్ విజిలెన్స్ అధికారి కోటాజీ, ఎంప్లాయి వెల్ఫేర్ బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పశు సంపదను వృద్ధి చేసుకోవాలి



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : రైతులు పశు సంపదను వృద్ధి చేసుకోవడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని సర్పంచ్ కాపా ఆదినారాయణ తెలిపారు. బుధవారం వి. వెంకటాయపాలెం గ్రామంలో పశువుల కోసం ఏర్పాటు చేసిన గర్భకోశ వ్యాధులు చికిత్స శిబిరాన్ని సర్పంచ్ కాపా ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అనుబంధంగా పశువులను పెంచుకోవడం ద్వారా కుటుంబానికి ఆర్థికంగా ఉపయోగపడటంతో పాటు వ్యవసాయ భూములకు ఎరువు కూడా లభ్యమవుతుందన్నారు. ప్రజల ఆరోగ్యానికి కూడా ఉపయోగపడతాయన్నారు. రైతులు పశు సంపదను వృద్ధి చేసుకోవాలని కోరారు. జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్పంచ్ కాపా ఆదినారాయణ క్యాంపుకు అవసరమైన మందులకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం అందించే సహకారంతో పాటు గ్రామస్తులు పశు గణాభివృద్ధికి తోడ్పాటు నందించాలన్నారు. మండల పశు వైద్యాధికారి క్రాంతికుమార్ మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా వచ్చే రోగాల పట్ల అప్రమత్తతతో ఉండాలన్నారు. డిస్ట్రిక్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రూప్‌కుమార్ గర్భకోశ వ్యాధులకు సంబంధించి పశువులకు చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ కృష్ణ, వార్డు సభ్యులు, వెటర్నరీ సిబ్బంది, టి. కృష్ణ, గోపాల మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు





ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : ఎప్పటినుండో ఎదురుచూస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ ఉత్తర్వులు జారీ చేశారు. 2021 సంవత్సరంలో పంచాయతీ కార్యదర్శులను తమ విద్య అర్హతను బట్టి ప్రవేశ పరీక్ష ద్వారా నియమించి సుమారు ఐదు సంవత్సరాలుకాగా అప్పటిలో కొంతమందికి గత ప్రభుత్వం రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా విడతలవారీగా కొంతమందిని రెగ్యులర్ చేస్తూ వచ్చింది. అప్పటి ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సరైన సమయంలో వేతనాలు ఇవ్వట్లేదని వేతనాలు పెంచట్లేదని నిరాహార దీక్షలు చేసిన సంఘటనలు ఉన్నాయి. తమ పోరాటాల ఫలితంగా దాదాపు అందరినీ రెగ్యులేట్ చేస్తూ అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 65 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రెగ్యులర్ కాని వారు ఉన్నారు. నాలుగు సంవత్సరాలు సర్వీస్ కాలం పూర్తయి కాగానే జూనియర్ కార్యదర్శులు రెగ్యులర్ చేయాల్సి ఉండగా కొంత ఆలస్యం అయింది 2026 నూతన సంవత్సరంలో జిల్లా కలెక్టర్ దొరిసెట్టిఅనిదీప్ జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ను రెగ్యులేట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి రెగ్యులర్ పత్రాలను కార్యదర్శులకు అందించారు. దీంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. తిరుమలాయపాలెం మండలంలోని నలుగురు జూనియర్ కార్యదర్శులు రెగ్యులర్ పత్రాలు అందాయి. అందులోని సుబ్లేడ్ కార్యదర్శి రాజ్ కుమార్, లక్ష్మీదేవి పల్లి తండా కార్యదర్శి ప్రణీత, ఏలూవారి గూడెం కార్యదర్శి స్నేహలత, పడమటి తండా కార్యదర్శి సంధ్యారాణి, గతంలో విధులు నిర్వహించిన కార్యదర్శులు పగడాల రమ్య, అనూష, గోపి, మరి కొందరు ఉన్నారు. ఈ రెగ్యులర్ కు సహకరించిన యూనియన్ నాయకులకు అభినందనలు తెలిపారు.

# ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : ప్రతికా రంగంలో ప్రజాపక్షం నూతన ఒరవడి సృష్టిస్తూ ప్రజల సమస్యలను నిరంతం వార్తల ద్వారా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రజాపక్షం దినపత్రిక ముందు వరుసలో ఉంటుందని ఎంపిడిఓ ఎస్కే సిలార్‌సాహెబ్, ఎస్సై కూచిపూడి జగదీష్, డిప్యూటీ తహశీల్దార్ సుధీర్ అన్నారు. 2026 ప్రజాపక్షం నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక ప్రజాపక్షం రిపోర్టర్ మేకల రాజుతో కలిసి ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ మార్పుల్లో పత్రికల పాత్ర ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని వారన్నారు. సమాజంలో జరుగుతున్న ఎన్నో సంఘటనలను వార్తల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారని అన్నారు. ప్రజాపక్షం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించేందుకు ఆహ్వానించిన పత్రిక విలేకరి మేకల రాజుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మీరా, పంచాయతీ కార్యదర్శులు అంజయ్య, వెంకటరమణ, నర్మద, ప్రణీత, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : మండల పరిధిలోని విఆర్ బంజర గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన చిన్నారి అన్నప్రాసన కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలకు, గర్భిణీలకు పౌష్టికాహారం అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హిమబిందు, అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి, ఆయా ఉమా, ఆశావర్కర్లు, స్థానికులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన నామ



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : బిఆర్‌ఎస్ మాజీ లోక్ సభ పక్షనేత, మాజీ ఎంపి నామ నాగేశ్వర రావు ఖమ్మంలో బుధవారం పర్యటించి ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించారు. ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీ నందు దిరిశాల వెంకటేశ్వరరావు మాతృమూర్తి మంగమ్మ ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ డిసిసిబి ఛైర్మన్ కూరాకుల నాగభూషణం సోదరుడు కూరాకుల పుల్లయ్య ఇటీవల మృతిచెందాడు. వి. వెంకటాయపాలెంని వారి నివాసంకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులు దానయ్య, కీమా, లాల్‌సింగ్, శంకర్, కోటేశ్వరరావు, ఆనందరావు, సత్యంబాబు, కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గోపాలపురంలో ఇటీవల మృతిచెందిన గొల్లపూడి నర్సింహారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# భవన నిర్మాణ కార్మికుల సమ్మె విరమణ



ప్రజాపక్షం/మధిర : నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా ప్రతి సంవత్సరంలాగానే భవన నిర్మాణ కార్మికులు గతకొన్ని రోజులుగా కనీస వేతనం పెంచాలని సమ్మె చేస్తున్న విషయం విధితమే. బుధవారం మధిరలో జరిగిన కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల యూనియన్ నాయకులు మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర ధరలకనుగుణంగా ఈ సంవత్సరం కూడా వేతన ఒప్పందం జరిగిందని, సమ్మెను విరమించటం జరిగిందని, అందువలన నేటి నుండి కార్మికులు యథావిధిగా పనుల్లో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆది వెంకటేశ్వర్లు, ఇల్లూరు మురళీ, కాలేశ్వరరావు, కత్తి జానయ్య, జక్రీసు కొండ, పెద్ద మేస్త్రీలు, మేస్త్రీలు, కూలీలు పాల్గొన్నారు.

# సర్పంచ్ శెట్టిపల్లిని సన్మానించిన కెటిఆర్



ప్రజాపక్షం/వైరా: వైరా మండలం సిరిపురం సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాస రావు, శాంతి దంపతులను బుదవారం ఖమ్మంలో తెలంగాణ భవన్‌లో జరిగిన సర్పంచ్‌లు సన్మాన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు గెలుపుకు సహకరించిన ప్రతిఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శ్రీనివాసరావు, శాంతి దంపతులు కెటిఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న సర్పంచ్ అశ్విని



ప్రజాపక్షం/వైరా: వైరా మండలం తాటిపూడి గ్రామ సర్పంచ్ జవ్వాజీ అశ్విని, నాగరాజు దంపతులు బుదవారం తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కాలిమార్గాన నడిచి వెంకట శ్రీ వెంకటేశ్వర ఆలయంలో సర్పంచ్ అశ్విని దంపతులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అశ్విని మాటాలడుతూ గ్రామ ప్రజలు మండల ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వినోద్ తదితరులు పాల్గొన్నారు.